అంధకారంలో పలు వీధులు

- నగరంలో నిలిచిన విద్యుత్ బల్బుల సరఫరా
- ఆరు నెలలుగా పంపిణీ శూన్యం
- అత్యవసరంగా 4 వేల బల్బులు అవసరం

నిజామాబాద్అర్బన్ : నగరంలో ముఖ్యమైన ప్రాంతాలతో పాటు పలు చోట్ల విద్యుత్ బల్బులు లేక రాత్రివేళ చీకట్లు అలుముకుంటున్నాయి. విద్యుత్ బల్బుల సరఫరాదారులు స్పందించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు ఇదివరకే మూడు సార్లు నోటీసులు అందజేసినా బల్బులు అందించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. బల్బుల సరఫరా కాంట్రాక్టును ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫీసియన్సీ సర్వీస్ లిమిటెడ్) వారు నిర్వహిస్తున్నారు. తమకు మున్సిపల్ కార్పొరేషన్ రూ.3 కోట్ల 40 లక్షల బకాయిలు చెల్లించాల్సి ఉందని, అవి చెల్లించకపోవడంతోనే బల్బుల సరఫరా నిలిపేశామని ఈఈఎస్ఎల్ చెబుతోంది. గతంలో ఉన్న బకాయిలను చెల్లించామని.. విద్యుత్ బల్బుల సరఫరా చేపట్టాలని ఆదేశించినా ఆ సంస్థ స్పందించడం లేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అత్యవసరంగా 4 వేల విద్యుత్ బల్బులు అవసరమున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్థానికుల ఫిర్యాదు మేరకు అత్యవసరంగా విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయవల్సి ఉంది. కానీ విద్యుత్ బల్బులు అందుబాటులో లేకపోవడంతో ఆ ప్రాంతంలో చీకట్లు కొనసాగుతున్నాయి. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా సంబంధిత అధికారులు మాత్రం మేల్కొనడం లేదు. ప్రతి రోజు మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయండి.. అంటూ స్థానికుల నుంచి ఐదు నుంచి పది ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా కూడా అధికారులు సమస్య పరిష్కారానికి శ్రద్ధ చూపడం లేదు.



ఒకటో డివిజన్‌లో వెలగని విద్యుత్ బల్బులు

గణేష్ ఉత్సవాలకూ ఇబ్బందే..

గణేష్ ఉత్సవాలకు అత్యవసరంగా 1200 విద్యుత్ బల్బులు అవసరమున్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. శోభాయాత్ర జరిగే ప్రాంతాలతో పాటు నిమజ్జనం జరిగే వి నాయక్‌నగర్ ప్రాంతంలో కూడా విద్యుత్ బల్బు లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం అధికారులు తర్జనభర్జనలు పడుతున్నారు. ప్రైవేట్‌గా కొనుగోలు చేసి ఏర్పాట్లు చేసేందుకే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

సంస్థ స్పందించడం లేదు

విద్యుత్ బల్బుల సరఫరాకు సంబంధించి ఈఈఎస్ఎల్ సంస్థను ఇదివరకే హెచ్చరించాం. గతంలో ఉన్న బకాయిలు కూడా చెల్లించాం. అయినా వారు స్పందించడం లేదు. మరోసారి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం. గణేష్ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఏర్పాట్లు చేస్తాం.

– మంద మకరంద్, నగర మున్సిపల్ కమిషనర్

బకాయిల వల్ల నిలిపేశాం

నగర మున్సిపల్ కార్పొరేషన్ విద్యుత్ బల్బుల సరఫరాకు సంబంధించి బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో విద్యుత్ బల్బులను సరఫరా చేసేందుకు సంస్థ నిరాకరించింది. అందుకే విద్యుత్ బల్బులు సరఫరా కావడం లేదు.

– సాయి, సూపర్‌వైజర్, ఈఈఎస్ఎల్ సంస్థ

క్లుప్తంగా

మూఢనమ్మకాలను వీడాలి

నిజామాబాద్ రూరల్: మూఢ నమ్మకాలను విడనాడాలని సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌లాల్ కోరారు. బుధవారం వినాయక్‌నగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బాణామతి, చేతబడులు చేస్తున్నారంటూ అమాయక ప్రజలను కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించలన్నారు. సభ్యులు రాజేందర్, వేముల శేఖర్ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నిజామాబాద్ రూరల్: కార్మికుల పట్ల నయా ఉదారవాద విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక నాందేడ్ వాడలో జరిగింది. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నయా ఉదారవాద విధానాల్ని అమలు చేస్తూ కార్మికులను ఒత్తిడికి గురి చేస్తోందని విమర్శించారు. నాయకులు నూర్జహాన్, శంకర్ గౌడ్, నన్నేసాహెబ్, జంగం గంగాధర్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో పాల్గొనండి

నిజామాబాద్ రూరల్: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ అశోక్ చౌహన్ తెలిపారు. బుధవారం లీడ్ బ్యాంక్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 17లోగా ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇద్దరు విద్యార్థులు ఒక టీం గా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ రూరల్: మాధవనగర్‌లో గల సాయిబాబా ఆలయ హుండీని బుధవారం లెక్కించారు. ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయ రామారావు, ఈవో శ్రీరామ్ రవీందర్ గుప్తా ఆధ్వర్యంలో మూడు నెలల 15 రోజులకు హుండీ లెక్కించారు. రూ.3,28,428 ఆదాయం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మాణిక్యశర్మ, హరిశర్మ, రాజుశర్మ, తదితరులున్నారు. అలాగే కంఠేశ్వర్‌లోని నీలకంఠేశ్వరాలయంలో బుధవారం హుండీని లెక్కించారు. రూ.2,47,265 ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు.

కఠిన చర్యలు తీసుకుంటాం

ఖలీల్ వాడి: గాజులపేట్‌లోని బోయగల్లీలోని వినాయక విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు టూటౌన్ ఎస్సై యాసిన్ ఆరాఫత్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో వినాయక విగ్రహం చేతులు ధ్వంసం చేశారని, గణేష్ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, విచారణ కొనసాగుతుందని ఎస్సై చెప్పారు.


నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మోపాల్: మండలంలో అన్ని గ్రామాల్లో నిమజ్జన ఏర్పాట్లను ఆయా చెరువుల వద్ద తహసీల్దార్ రామేశ్వర్, ఎంపీడీవో రాములునాయక్, ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని భక్తిశ్రద్ధలతో శోభాయాత్రను నిర్వహించుకోవాలని సూచించారు. చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు.

ఆకుల కొండూర్ లిఫ్ట్ ..

నిజామాబాద్ రూరల్: ఆకుల కొండూర్‌లో ఉన్న లిఫ్ట్‌ను జిల్లా నీటిపారుదల అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో లిఫ్ట్‌లో మోటార్లు చోరీకి గురయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రామ రైతులు నీటిపారుదల శాఖ ఉన్నత అధికారులకు తమ గోడును విన్నవించారు. ఈ మేరకు బుధవారం నీటి పారుదల అధికారులు లిఫ్టును పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు



పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సాక్షి నెట్‌వర్క్ : నగరంలో కొలువుదీరిన గణనాథులు బుధవారం ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు నైవేద్యాలు సమర్పించి విఘ్నాలు తొలగాలని వేడుకున్నారు. కొన్ని మండపాల వద్ద అన్నదానం చేశారు. పలు చోట్ల వినాయకులను నిమజ్జనానికి తరలించారు. నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో గల గుమాస్తా సంఘం గణేష్ మండలిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.



క్యాంపస్‌లో పూజలు నిర్వహిస్తున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు

కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

సిరికొండ: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో తారాచంద్‌కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ఎనిమిది నెలల నుంచి జీతాలు రాకపోవడంతో కార్మికులు అల్లాడుతున్నారని వాపోయారు. జిల్లా కలెక్టర్ స్పెషల్ ఫండ్ నుంచి జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. నాయకులు సాయారెడ్డి, కిషోర్, అనీస్, లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



పార్టీలో చేరుతున్న హరిచంద్, ఇతర నేతలు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన శేఖర్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా సారంగపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస నాయకులు హరిచంద్ హైదారాబాద్‌లో మహేష్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు 50 మంది పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

తొర్లికొండ బీఆర్ఎస్ నేత

జక్రాన్‌పల్లి: తొర్లికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత రత్నగారి శేఖర్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం నిజామాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి పార్టీ కండువా కప్పి శేఖర్‌గౌడ్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బ్రాహ్మణ్‌పల్లి సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి, సీనియర్ నాయకుడు గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ డిమాండ్ చేశారు. బుధవారం హాస్టల్‌ను సందర్శించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి హాస్టల్‌లోకి కొందరు ఆకతాయిలు చొరబడినట్లు ఆరోపించారు. దీంతో హాస్టల్ విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఆకతాయిలను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు సాయిబాబా, శివ, రాజేష్, రాజేందర్, హాస్టల్ విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత కర్క గణేష్

ఆదర్శమూర్తి నటేశ్వర శర్మ


నిజామాబాద్ రూరల్: జీవితాన్ని రసతరంగంలా మార్చుకున్న ఆదర్శమూర్తి, మహాకవి, అవధాని, కవి పండితుడు డాక్టర్ నటేశ్వర శర్మ అని ప్రముఖ కవి పంచరెడ్డి లక్ష్మణ్ అన్నారు. బుధవారం కేర్ డిగ్రీ కళాశాలలో హరిదా రచయితల సంఘం, తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ నటేశ్వర శర్మ సంస్మరణ సభ 'నటేశ్వరునకు నివాళి' జరిగింది. తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం జిల్లా అధ్యక్షుడు తిరుమల శ్రీనివాస్ ఆర్య, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచాలి

ఖలీల్ వాడి: ఆర్టీసీ బస్సుల సర్వీసులు, పనిచేసే సిబ్బందిని పెంచాలని ప్రగతిశీల మహిళ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ ఆనంద్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంధ్యారాణి మాట్లాడుతూ.. తాడెం, మోపాల్, కులాస్పూర్, కంజర, ముల్లంగి, ఘన్‌పూర్, డిచ్‌పల్లి బస్టాండ్ వరకు బస్సుల సౌకర్యం, సర్వీస్‌లను పెంచాలని కోరారు. సిర్పూర్, ముదక్ పల్లి, బాడ్సి, సింగంపల్లి గ్రామంలో బస్సు సర్వీసులను పెంచాలన్నారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గౌర, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ పాల్గొన్నారు.

భగవద్గీత పుస్తకాల వితరణ



నిజామాబాద్ రూరల్: గణేష్ నవరాత్రుల సందర్భంగా భగవద్గీత పుస్తకాలను బుధవారం జిల్లా కేంద్రంలో గిరిరాజ్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ సేర్ల దయానంద్ వితరణ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వ్యకి భగవద్గీతలో ఉన్న శ్లోకాల అర్థం తెలుసుకుని జీవితంలో వినమ్రతతో జీవించాలని కోరారు. ఇప్పటి వరకు 2వేలకు పైగా భగద్గీత పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి



నిజామాబాద్అర్బన్: అర్హులైన వారందరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మకరంద్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. బదిలీ అయిన ఓట్ల వివరాలు, మరణించిన వారి వివరాలు తెలియజేసి సరైన ఓటర్ లిస్ట్ తయారీకి రాజకీయ పార్టీల నేతలు సహకరించాలన్నారు. సమావేశంలో నార్త్, సౌత్ తహసీల్దార్లు, నగరపాలక సంస్థ ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన



సుభాష్‌నగర్: నగరంలోని నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ప్రెసిడెన్సీ పాఠశాల 5, 7వ తరగతి విద్యార్థులు సుమారు 180 మంది బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా బ్యాంకులో రోజువారి కార్యకలాపాలు, నగదు జమ చేయడం, తీసుకోవడం, లాకర్లలో విలువైన సామాన్లను భద్రపరచుకోవడం, ఖాతాదారులకు సంబంధించి బ్యాంకింగ్ కార్యకలాపాలు వంటి వివరాలు సీఈవో నాగభూషణం క్లుప్తంగా వివరించారు.

ఘనంగా రాధాష్టమి వేడుకలు

నిజామాబాద్ రూరల్: భగవంతుడి అంతరంగిక శక్తి రాధారాణి అని ప్రముఖ హరే కృష్ణ ఉపన్యాస కర్త, ఆధ్యాత్మిక వక్త రాధిక రూపరాణి అన్నారు. బుధవారం కంఠేశ్వర్‌లో గల ఇందూర్ ఇస్కాన్‌లో రాధాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాధా అష్టమి గురించి వివరించారు. ఆది పురుష గోవింద దాసు, మిఠాయి చంద్, తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: నగరంలోని గాజుల్‌పేట్‌లోగల బోయిగల్లీలో వినాయకుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వినాయకుడి చేతులు విరగ్గొట్టి, కిరీటాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. దుశ్చర్యకు పాల్పడిన వారిని 24 గంటల్లో గుర్తించి, ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించాలని ఏసీపీతో ఫోన్లో డిమాండ్ చేశారు. నవరాత్రులు ముగిసే వరకూ పోలీస్ భద్రత పెంచాలన్నారు. విషయం తెలిసి హిందూ సంఘాలు ఘటనా స్థలికి చేరుకున్నాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నాయకులు, ప్రజలు సంయమనం పాటించాలని, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షిస్తామని పోలీసులు నచ్చజెప్పారు. కార్పొరేటర్ ఇల్లందుల మమతా ప్రభాకర్, నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నందు, మండపం నిర్వాహకులు పాల్గొన్నారు.



ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వర్గీకరణ తీర్పును ఉపసంహరించాలి

- పూలాంగ్ వద్ద ఎస్సీ,ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నిరసన

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఉపసహరించుకోవాలని జిల్లా అధ్యక్షులు సక్కి విజయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజులు డిమాండ్ చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీల ఆధ్వర్యంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నా నిరసన కార్యక్రమాలకు మద్దతుగా బుధవారం ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాదు జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కమిటీ ప్రతినిధులు రామచంద్ర గైక్వాడ్, సుశీల్‌కుమార్, వినయ్, కిష్టయ్య, సిద్ధం రాజేందర్, తదితరులున్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

హైడ్రా మాదిరి నిడ్రా ఏర్పాటు చేయాలి

- తెలంగాణ మేధావుల సంఘం ఛైర్మన్ డాక్టర్ బి.కేశవులు డిమాండ్

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని చెరువులు, కుంటలు, వాగులు, పార్కులను కాపాడటానికి 'హైడ్రా' తరహాలోనే 'నిడ్రా'ను ఏర్పాటు చేయాలని తెలంగాణ మేధావుల సంఘం ఛైర్మన్ డాక్టర్ బి.కేశవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని ఖలీల్‌వాడిలో గల డాక్టర్ కేశవులు ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ' జిల్లాలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలు – నిడ్రా ఏర్పాటు' అంశంపై అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా డాక్టర్ కేశవులు మాట్లాడుతూ.. నగరంలోని పూలాంగ్ వాగుతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, డిచ్‌పల్లి ప్రాంతాల్లోని చెరువుల శిఖాలు, నిజాంసాగర్ కాల్వ కట్టల వద్ద కబ్జాలపై గతంలోనే ఫిర్యాదులు వచ్చినప్పటికి అధికారులు పట్టించుకోకపోవడం దారుణమనారు. నగర శివారులోని నిజామాబాద్– బోధన్ రహదారి పక్కనే రామర్తి చెరువు విస్తీర్ణం సుమారు 30 ఎకరాలు కాగా ప్రస్తుతం 15 ఎకరాలు కూడా లేదన్నారు. భీమ్‌గల్‌లో దాదాపు 73 ఎకరాల విస్తీర్ణంలోని రాథం చెరువు శిఖం ప్రాంతం 10 ఎకరాలకు మించి ఆక్రమణలను గుర్తైందన్నారు. అవినీతికి పాల్పడ్డ అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. వెంటనే జిల్లాలో 'నిడ్రా'ను ఏర్పాటు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె భూమన్న, సీనియర్ జర్నలిస్ట్ బొబ్బిలి నర్సయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ నాయకులు మురళి, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు దండి వెంకట్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవులు

క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల హెల్ప్ డెస్కులు

తెయూ(డిచ్‌పల్లి): కొత్తగా పీజీ అడ్మిషన్లు జరుగుతున్న సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలో బుధవారం పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. అడ్మిషన్స్ కోసం వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి యూనివర్సిటీకి వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తాము సహకరించేందుకు హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,500	వెండి (కిలో)	87,500
22 క్యారెట్స్	68,727		


– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	15	30
జీరకాయ	60	80	దోసకాయ	20	40
దొండ	40	60	ఆలుగడ్డ	30	50
బీర్నీసు	120	150	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	80	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	30	50
పాలకూర	90	140	కరివేపాకు	40	60
మెంతికూర	90	140	చామగడ్డ	40	60
కొత్తిమీర	150	200	గోరుచిక్కుడు	30	50
పుదీనా	70	90	చిక్కుడుకాయ	50	90
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	చిన్నకథ కాదు (తెలుగు)-10.10 సరిపోదా శనివారం -12.55, 7.15, 10.25
స్క్రీన్-2	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైం (తెలుగు) - 10.00, 7.10, 10.35, 35: చిన్నకథ కాదు (తెలుగు) - 1.50, ఏఆర్ఎం (తెలుగు) 7.30, 10.30
స్క్రీన్-3	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైం (తెలుగు) - 12.40, 4.10, 35 : చిన్నకథ కాదు (తెలుగు) - 7.40, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సరిపోదా శనివారం - 3.35, ఏఆర్ఎం (తెలుగు) 7.10, 10.20
స్క్రీన్-2	ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు)- 11.00, 2.45, 6.30, సరిపోదా శనివారం - 10.15
స్క్రీన్-3	35 : చిన్నకథ కాదు (తెలుగు) -12.50, 3.55, 7.00, 10.05
స్క్రీన్ -4	స్త్రీ-2(హిందీ)-12.00, 3.15, 6.30, 9.45
లలితామహల్	సరిపోదా శనివారం (తెలుగు)
దేవి	ది గోట్(తెలుగు)
నటరాజ్	గబ్బర్‌సింగ్ (తెలుగు)
విజయ్	35 చిన్నకథ (తెలుగు)

సంక్షిప్తం

పోషణ మాసోత్సవాలు

ఇందల్వాయి: ఇందల్వాయి ఆరోగ్య కేంద్రం పరిధిలోని డిచ్‌పల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు జరుగుతున్నాయి. బుధవారం సిర్నాపల్లి, మేఘ్యానాయక్ తండా, ఇందల్వాయి గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది అంగన్వాడీ టీచర్లతో కలిసి మహిళలకు, గర్భిణీలకు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు.

108 వాహనంలో మహిళ ప్రసవం

ధర్పల్లి/నిజామాబాద్ నాగారం: ఇంద్రానగర్ తండాకు చెందిన గర్భిణి మౌనికకు పురిటి నొప్పులు రావడంతో ధర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మంగళవారం రాత్రి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది శేఖర్ గౌడ్, పైలట్ సుధాకర్ కాన్పు జరపగా మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఇద్దరు క్షేమంగా ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మోపాల్: మంచిప్ప, బాడ్సి, ముదక్‌పల్లి, కులాస్‌పూర్ గ్రామాల ప్రజలు రాత్రివేళల్లో అప్రమత్తంగా ఉండాలని, ఈ ప్రాంతంలో చిరుతలు సంచరిస్తున్నాయని ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో రవిమోహన్‌భట్ బుధవారం తెలిపారు. మేకలు, గొర్రెలు వంటి మూగజీవాలను దూర ప్రాంతాల్లో కాకుండ ఇంటి పరిసరాల్లోనే ఉంచాలన్నారు. చిరుతల సంచారంపై ఆనవాళ్లు సేకరించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ధర్పల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన కార్మికులకు ఎంపీడీవో బాలకృష్ణ ఆదేశించారు. బుధవారం రామడుగు, మైలారం, గోవింద్ పల్లి, చల్లగర్గ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి వంట సామగ్రి, రికార్డులను తనిఖీ చేశారు.

గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు

నిజామాబాద్ రూరల్: పాల్దా, మల్లారం, ధర్మారం, లింగితండా, మల్కాపూర్ ముత్త కుంట గ్రామాల్లో గ్రామ పంచాతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

డిజిటల్ గడియారం అందజేత

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌లో ప్రభుత్వ పాఠశాలకు 2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు డిజిటల్ గడియారాన్ని బుధవారం అందజేశారు. హైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లకు వాటిని ఆయా హెచ్ఎంలకు అందించారు. లక్ష్మణ్, ప్రసాద్‌రెడ్డి, ప్రభు, సంజీవ్, గంగమల్లు, గంగారెడ్డి, నవీన్, తస్లీమ్ తదితరులు పాల్గొన్నారు.

'కూచిపూడి'లో చిన్నారుల ప్రతిభ



మోపాల్: నగర శివారులోని బోర్గం(పి) గ్రామానికి చెందిన బెండ సహస్ర, చైతన్య హైదరాబాద్‌లో గురు పూజోత్సవం సందర్భంగా గురువందనం నృత్యోత్సవంలో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. సహస్ర, చైతన్య కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలివెలుగు.ఓఆర్‌జీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు ఉత్తమ ప్రతిభను కనబరచడంతో నృత్యకౌటిల్య పురస్కారంతో సన్మానించి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. అభినయ డ్యాన్స్ అకాడమీ శిక్షకులు శ్రీవేణి, తదితరులున్నారు.